క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: నందివాడ మండలం రుద్ర పాక సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ డీఈ జీబీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలం లోని రుద్రపాక, పోలుకొండ, అనమనపూడి, శంకరంపాడు, గాజులపాడు, గండేపూడి, పానుకుమాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కొండలమ్మను దర్శించుకున్న ఇన్‌చార్జి కలెక్టర్ తల్లిదండ్రులు



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మ వారిని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ తల్లిదండ్రులు మంగళవారం దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

కాంట్రాక్ట్ డ్రైవర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: ఏపీఎస్ఆర్టీసీ గుడివాడ డిపోలో రోజువారీ వేతనంపై పని చేసేందుకు డ్రైవర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక డిపో మేనేజర్ డి.రాజేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్స్ పొంది 14 నెలలు పూర్తయి ఉండాలని పేర్కొన్నారు. డ్రైవర్‌కు సంబంధించి ఎటువంటి యాక్సిడెంట్లు లేనట్లు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, హెవీ లైసెన్స్‌తో డిపో మేనేజర్ కార్యాలయంలో ఈనెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాల విచారణ అనంతరం నియామకాలపై సమాచారం ఇస్తామని ఆయన తెలిపారు.

ఖో-ఖో క్రీడాకారుల ఎంపిక

గుడివాడ టౌన్: జాతీయ క్రీడా దినోత్సవం 2025ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ శాప్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అండర్-22 బాలబాలికల ఖో-ఖో క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు ఖో-ఖో ఇన్‌చార్జి మడకా ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సెలక్షన్ ట్రైల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు జిల్లా జట్టు తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98482 45468ను సంప్రదించాలని కోరారు.

పోలీసుల అదుపులో హుండీ దొంగలు

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడిలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో హుండీ పగలగొట్టి చోరీ చేసిన కేసులో పెడన బ్రహ్మపురం గ్రామానికి చెందిన ముగ్గురు బాలురును మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు కూచిపూడి ఎస్ఐ కేవీఎస్ విశ్వనాథ్ తెలిపారు. ఈ బాలురు గతంలో పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో కోళ్లను సైతం దొంగతనం చేసినట్లుగా విచారణలో తేలిందని తెలిపారు. వీరిపై గతంలో పెడన పోలీస్‌స్టేషన్‌లోనూ పలు దొంగతనం కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గుడివాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధితో పాటుగా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. టీడీపీ నాయకుడు కొడాలి రామరాజు, డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

నేరుగా విత్తే వరి పొలాల్లో కలుపు సమస్య అధికం

మండవల్లి: నేరుగా విత్తే వరి పొలాల్లో కలుపు సమస్య అధికంగా ఉంటుందని ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్ పేర్కొన్నారు. కొర్లపాడు రైతు సేవా కేంద్రం, క్లస్టర్ పరిధిలోని కొర్లపాడులో మండల వ్యవసాయాధికారి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీపీఏ రవీంద్ర పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏడీ జి.వెంకటమణి రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. వరిలో కలుపు యాజమాన్య పద్ధతులను ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్ వివరించారు. గడ్డి జాతి కలుపు నివారణకు సైహాలో-ఫాప్‌బ్యుటైల్ అనే కలుపు మందు ఎకరాకు 400 మిల్లీలీటర్లు గడ్డిజాతితో పాటు వెడల్పు ఆకు కలుపు ఎక్కువగా ఉంటే బిస్‌పైరిబాక్ సోడియం అనే మందు 100-200 మిల్లీలీటర్లు పిచికారీ చేసి కలుపును నివారించుకోవచ్చని పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణ

- రోడ్డు పక్కనే స్తంభాలు ఏర్పాటు చేసిన టీడీపీ నేత
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆదమరిస్తే వాహనచోదకులు ప్రమాదాలకు గురి కావాల్సిందే



చాటపల్లి పంచాయతీలో సిద్ధాంతం-పెద ఎడ్లగాడి ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన సిమెంట్ స్తంభాలు

గుడివాడరూరల్: ఆయన గుడివాడ పట్టణానికి చెందిన ప్రముఖ టీడీపీ నేత. మాజీ ప్రజాప్రతినిధి. ఆక్రమణలకు అలవాటు పడ్డ సదరు నేత ఏకంగా రోడ్డునే ఆక్రమించి అక్రమంగా స్తంభాలు ఏర్పాటు చేశారు. రోడ్డు ఆక్రమణ వలన ఆదమరచి వెళ్తే ప్రమాదాల బారిన పడతామని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు నేత పలుకుబడికి భయపడిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

టీడీపీ నేత పొలం ముందు స్తంభాలు

సిద్ధాంతం-పెద ఎడ్లగాడి ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని గుడివాడకు చెందిన టీడీపీ నాయకుడికి పొలం ఉంది. ఆ రోడ్డుకు సమీపంలో వైన్‌షాపు ఉండటంతో పరిసర ప్రాంతాల్లోని పేదలు చిన్న బడ్డీ కొట్లు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. దీంతో ఆ నాయకుడు పొలం ముందు రోడ్డుపక్కనే ఉన్న స్థలానికి కొన్ని రోజులుగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. స్తంభాలు రోడ్డు మార్జిన్‌ను ఆనుకుని ఏర్పాటు చేయడంతో పరిసర ప్రాంతాల్లో ఆక్వా పరిశ్రమకు వచ్చి, వెళ్లే భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకోవడానికి వీల్లేకుండా ఉంది. వాహనదారులు సైతం ఆదమరిచి వెళ్తే స్తంభాలకు ఢీకొని ప్రమాదాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. సదరు నేత పరిసర ప్రాంతాల్లో రియల్ వెంచర్ వేయడానికే రోడ్డును ఆక్రమించి స్తంభాలు ఏర్పాటు చేశారని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

రోడ్డును ఆక్రమించి స్తంభాలు ఏర్పాటు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేసినా.. గ్రామాల్లో సమస్యలను గ్రామ కార్యదర్శి పట్టించుకోవాలని తెలిపారు. గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా ఆర్‌అండ్‌బీ రోడ్లను ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు కాపాడుకోవాలని తమకు ఎటువంటి సంబంధం లేదని ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రోడ్డుకు అడ్డుగా ఉన్న స్తంభాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన

సిద్ధాంతం-పెద ఎడ్లగాడి ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని కొన్ని రోజులు క్రితం పెద్ద స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో రైల్వే గేటు ఉంది. రాత్రి వేళల్లో రైలు వెళ్లిపోయిన తర్వాత గేటు తీస్తే చిన్న వాహనాలే ఎదురెదురుగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఒకవేళ భారీ వాహనాలు వస్తే నరకమే. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళనగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేసిన స్తంభాలను వెంటనే తొలగించాలి.

– శివకుమార్, వాహనదారుడు

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దు



తోట్లవల్లూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొండలబాబు



గుడివాడలో ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు



కూచిపూడిలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

తోట్లవల్లూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం నాయకుడు కంభం కొండలబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ ఎం.కుసుమకుమారికి కొండలబాబు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు జుజ్జవరపు ఏసోబు, ఈడ్పుగంటి డేవిడ్‌రాజు, యేమినేని సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ప్రజలపై పెనుభారం మోపనున్న విద్యుత్ చార్జీల పెంపునకు కారణం అవుతున్న స్మార్ట్ మీటర్లు ఏర్పాటును విరమించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్‌లోని సబ్‌స్టేషన్ ఎదుట వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. దీని వలన పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికే ప్రజల నుంచి సంతకాల సేకరణ ప్రారంభించామన్నారు. ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ జి. ప్రకాష్‌బాబు, వామపక్ష నాయకులు పి. సురేష్, పి. రజిని, సత్యనారాయణ పాల్గొన్నారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ట్రూ అప్ చార్జీలు ఎత్తివేయాలని, స్మార్ట్ మీటర్లు బిగింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కూచిపూడి సెంటర్లో ధర్నా చేశారు. అనంతరం కోసూరులోని విద్యుత్ సబ్-స్టేషన్లో సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, అనుబంధ సంస్థల నేతలు కోదాటి నారాయణరావు, బోరుకాటి నరసింహారాజు, నందం వెంకటేశ్వరరావు, బల్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వం

పామర్రు(మొవ్వ): విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోనికి వచ్చిన కూటమి నాయకులు ప్రజలపై అధిక భారాలను మోపుతున్నట్లు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి గంగాధర ప్రసాద్ పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం పామర్రు సెంటర్లో ధర్నా చేశారు. అనంతరం పామర్రు ట్రాన్స్ కో ఏడీఈ కార్యాలయంలో జూనియర్ ఇంజనీర్ శేషగిరిరావుకు ప్రజల నుంచి సేకరించిన సంతకాల ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో వేము పెదబాబు, ఇంటి రాజు, కె నాగభూషణం, సునీల్, రమేష్, ప్రసాద్, బాబురావు పాల్గొన్నారు.

కలిదిండిలో..

కలిదిండి(కైకలూరు): స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేసి కరెంటు చార్జీలను తగ్గించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలోమంగళవారం కలిదిండి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కలిదిండిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి మండలంలోని గ్రామాల్లో ప్రజల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాలను తహసీల్దార్‌కు అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మహంకాళి రావు, సీఐటీయూ మండల కార్యదర్శి జక్కుల మహేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో ప్రాణహాని



మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినిల్

గుడ్లవల్లేరు: మాదక ద్రవ్యాల వినియోగంతో ప్రాణహాని ఉందని విద్యార్థులకు డీఎస్పీ వి.ధీరజ్ వినిల్ సూచించారు. స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త విద్యార్థులకు అవసరమైన సమాచారం, విద్యార్థులకు సంస్థకు చెందిన మౌలిక సదుపాయాలు, నియమ నిబంధనలపై కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ ఎన్డీపీఎస్ చట్టంలోని ముఖ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, రూరల్ సీఐ సోమేశ్వరరావు గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారిణికి అభినందన



గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కార్యాలయంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో వెండి పతకం సాధించిన గొట్టిపల్లి హర్షితను మంగళవారం స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2,3 తేదీల్లో మచిలీపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-13 ఓపెన్ బాలికల చెస్ పోటీల్లో స్టేడియం క్రీడాకారిణి హర్షిత, అండర్-7 విభాగంలో వెండి పతకం సాధించినట్లు తెలిపారు. హర్షిక భవిష్యత్‌లో అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదగాలని తాము కోరుతున్నామన్నారు. స్టేడియం సంయుక్త కార్యదర్శి కె. రంగ ప్రసాద్, హర్షిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణాలకు నిధుల చెక్కుల పంపిణీ

కైకలూరు: నియోజకవర్గంలో పలు ఆలయాలకు దేవదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా మంజూరైన నిధుల చెక్కులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వరహాపట్నం నివాసం వద్ద మంగళవారం పంపిణీ చేశారు. కలిదిండి మండలం చినతాడినాడ పంచాయితీ పల్లెపాలెం కనకదుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి రూ.10,00,000, దేవాలయం ధూప దీప నైవేద్యాలకు ప్రతి నెలా రూ.10,000, అదే విధంగా మండవల్లిలో రామాలయం పునర్నిర్మాణానికి రూ.5,50,000 మంజూరయ్యాయి. కార్యక్రమంలో కూటమి నేతలు పూల రాజీ, కొల్లి బాబీ, తోట లక్ష్మీ, నల్లగోపుల చలపతి పాల్గొన్నారు.


డ్రోన్ టెక్నాలజీతో మహిళ మృతదేహం గుర్తింపు



దేవరపల్లి వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చిట్టిబాబు

తోట్లవల్లూరు: కేఈబీ కాలువలో జారిపడి గల్లంతైన వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులు డ్రోన్ సాయంతో కనుగొన్న ఘటన దేవరపల్లి వద్ద జరిగింది. మండలంలోని రొయ్యూరుకు చెందిన లుక్కా వెంకటేశ్వరమ్మ(67) ఈ నెల 3వ తేదీన కేఈబీ కాలువలో పడి గల్లంతైంది. ఆమె కుమారుడు లుక్కా శివ నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ అవినాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆదేశాలతో పమిడిముక్కల సీఐ చిట్టిబాబు పర్యవేక్షణలో ఎస్ఐ అవినాష్ ప్రత్యేక బృందాల ద్వారా కేఈబీ కాలువలో గాలింపు నిర్వహించారు. వెంకటేశ్వరమ్మ ఆచూకీ లభ్యం కాకపోవటంతో డ్రోన్ టెక్నాలజీని రంగంలోకి దించారు. డ్రోన్ సాయంతో కేఈబీ కాలువలో గాలింపు జరుపుతుండగా మంగళవారం మండలంలోని దేవరపల్లి వద్ద వెంకటేశ్వరమ్మ మృతదేహం ఆచూకీ లభ్యమైంది. కుటుంబసభ్యులకు సమాచారం అందించి ఆమె మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు సీఐ తెలిపారు.

సాగునీటి లాకుల పరిశీలన



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో సాగునీటిని అందించే లాకులను రాష్ట్ర సాగునీటి మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించారు. 1.60లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించే స్థానిక పుల్లేటి కాల్వ నుంచి చీలే క్యాంప్‌బెల్, బంటుమిల్లి, పోల్‌రాజ్ కెనాల్‌కు చెందిన లాకులను తిలకించారు. కార్యక్రమంలో గుడివాడ, పెడన ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు పంచాయతీ పరిధిలోని ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం దుకాణాలతో పాటు ఇంటింటికీ తిరిగి నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు



బాబు మోసాలపై క్యూఆర్ కోడ్ పత్రాలను చూపుతున్న డీఎన్నార్, నాయకులు

వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ఎవరూ భయపడేది లేదని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, కైకలూరు నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు పార్టీ కార్యాలయం వద్ద బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. డీఎన్నార్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డయాలసిస్ సెంటర్, పెద్దింట్లమ్మ వారధి, అనివేటి మండపం, మీసాల వెంకన్న గుడి పునరుద్ధరణ వంటి అభివృద్ధి పనులు చేయించానన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఒకే వేదికపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని సవాలు విసిరారు. కైకలూరు గ్రీన్ విలేజ్‌లో పేదలకు ఇంటి స్థలాలు అందించామన్నారు. డీఎన్నార్ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడానికి విచారణలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. శివారు భూములకు సాగు, తాగునీరు పూర్తి స్థాయిలో తీసుకురావడంలో ఎమ్మెల్యే విఫలం చెందారన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీరరాజు, పార్టీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. గ్రామాల్లో మంచినీటి కన్నా మద్యం దొరుకుతుందన్నారు. ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, మేధావుల ఫోరం రాష్ట్ర నాయకుల బీవీ రావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

గుడివాడ టౌన్: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం జీఎల్ఆర్ యూత్ లక్ష్యం అని యూత్ కన్వీనర్ గణపతి శివ అన్నారు. సోమవారం మున్సిపల్ పాఠశాల్లో 2024-25 విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 18 మంది విద్యార్థులకు రూ.36 వేలు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు అందజేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత గణపతి లక్ష్మణరావు కుమారులు ఈ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ మాజీ చైర్మన్ జి.లక్ష్మీ రంగనాయకమ్మ మాట్లాడుతూ గణపతి లక్ష్మణరావు విద్యను ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు నిర్వహించేవారన్నారు. తండ్రి చేసిన సేవలను తిరిగి కుమారులు కొనసాగించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకట లక్ష్మీకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు అద్దేపల్లి పురుషోత్తం, అడపా పండు, లోయ రాజేష్, దూబా రాజేష్, విజయలక్ష్మి, ఎం. గోవిందమ్మ పాల్గొన్నారు.

నూతన అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

కైకలూరు: అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేసి, ప్రమాద బీమా పాలసీని వెంటనే పునరుద్ధరించాలని ఏపీయూడబ్ల్యూజే కైకలూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ సభ్యులు తహసీల్దార్ ఎండీ ఇబ్రహీంకు మంగళవారం వినతిపత్రం అందించారు. జర్నలిస్టుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని కైకలూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ జర్నలిస్ట్‌లకు ఇస్తున్న అక్రిడేషన్ల మంజూరు విషయంలో ప్రభుత్వం వాయిదాలు వేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా జాయింట్ సెక్రటరీ పెద్ది సురేష్, జిల్లా సామ్నా కార్యదర్శి కురెళ్ల కిషోర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్యామ్, నరహరిశెట్టి శ్యాంబాబు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన పిల్లలకు బహుమతులు

కూచిపూడి(మొవ్వ): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కూచిపూడి పంచాయతీ పరిధిలోని ఒకటో నంబరు కేంద్రంలో నాలుగు కేంద్రాల కార్యకర్తలు నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్యవంతమైన చంటి పిల్లలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, పంచాయితీ సభ్యుడు కావూరి పూర్ణ చంద్రశర్మ హాజరయ్యారు. చిన్నారులకు బహుమతులు అందించడంతో పాటు తల్లిపాల విశిష్టతపై సూచనలు ఇచ్చి తల్లులను చైతన్య పరిచారు. కార్యక్రమంలో కూచిపూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఏఎస్ కల్యాణి, రోటరీ ఉపాధ్యక్షుడు కొండవీటి అమరబాలేశ్వరరావు పాల్గొన్నారు.

రొయ్యలకు వచ్చే వ్యాధులపై సర్వే

నందివాడ: మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో రొయ్యలకు వచ్చే వ్యాధులపై ఆక్వాసాగు ఉన్నటువంటి ప్రాంతంలో మంగళవారం సర్వే నిర్వహించారు. అరిపిరాల గ్రామంలో ఆక్వాఫామ్ నిర్వహిస్తున్న కుమార్‌రాజు ఆక్వా చెరువుల్లో నేషనల్ సర్వేలియన్స్ ప్రోగ్రాం ఆక్వాటిక్ యానిమల్ డిసీస్ కమిటీ వారు రొయ్యలను పరీక్షించి, వాటి శాంపిల్స్‌ను సేకరించారు. రొయ్యల్లో వచ్చే విబ్రియో వ్యాధికి సంబంధించి రైతుల వద్ద నుంచి సమాచారం సేకరించినట్లు రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో శివరాం, డి. వంశీ, ఎఫ్‌డీఓ దత్తాత్రేయ, మత్స్యశాఖ ఉప సంచాలకులు సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే కార్యాలయానికి మంగళవారం ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ నాయకత్వంలో చంద్రాల శివారు సింగలూరు వాసులు వెళ్లి తమ గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కలుషితమైన తాగునీటితో చర్మవ్యాధులు వస్తున్నాయని తెలిపారు. పంట పొలాల నుంచి వచ్చే మురుగు మంచినీటి చెరువులోకి చేరటం వలన ఈ వ్యాధులు వస్తున్నాయని ఆరోపించారు. ఆ చెరువుకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామస్తుల వినతికి స్పందించిన ఎమ్మెల్యే రాము అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు బండారు సరస్వతి, ఉద్దంటి నాగ మల్లేశ్వరరావు, మాచర్ల రమణయ్య, తుమ్మలచర్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకంతో భూసారం తగ్గుదల

కైకలూరు: అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులను వాడటం వలన పెట్టుబడులు పెరగడంతో పాటు ఆదాయం, భూసారం తగ్గుతుందని కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.పార్వతి పేర్కొన్నారు. రాచపట్నం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఓ ఆర్.దివ్య, సర్పంచ్ అల్లూరి మంగారావు, నాయకులు జక్కుల విజయ్ కుమార్, వాసుపల్లి సతీష్‌కన్నా, అందుగుల వెంకటరత్నం పాల్గొన్నారు.